వైఎస్సార్ భీమా తక్షణ సాయం అందజేత

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మేఘవరం పంచాయతీ పాతమేఘవరం గ్రామానికి చెందిన సాధుపిల్లి పార్వతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, నామినీ మృతురాలి కుమార్తె బైపిల్లి నీలవేణికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయం పది వేలు రూపాయలు మేఘవరం పంచాయతీ సర్పంచ్ పరపటి సునీత శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేఘవరం ఉప సర్పంచ్ మంకు సింహాచలం, సిరిగిడీ రాము, వెల్ఫేర్ అసిస్టెంట్ అంగూరు మధు సూధన రావు, వాలంటీర్ సిరిగిడీ.కామేష్, కారిమోహన్, వసంత్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిబిఏ-1 పరీక్షల నిర్వాహణపై తనిఖీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఫార్మేటివ్ అసెస్మెంట్ 1(సి బి ఏ 1) పరీక్షల నిర్వహణ తీరుపై మండల విద్యాశాఖ అధికారి అర్జునుడు సంతబొమ్మాళి ఆదర్శ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, వివిధ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. ప్రశ్నాపత్రాలు విద్యార్థులకు తగ్గట్టు పాఠశాలకు చేరాయో లేదో విచారించి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏవిధంగా సి బి ఏ వన్ పరీక్షలు రాస్తున్నా పరిశీలించి, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అంగూరు రామారావు, ఉపాధ్యాయులు, లఖినాన వెంకటరమణ సిమ్మన్న, పావని, ఉన్నారు.

అమ్మవారికి బంగారు బుట్టాలు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట పట్టణం శ్రీశయనవీధిలో వెలసిన శ్రీజలంత్రపోలమ్మ తల్లి అమ్మవారికి పట్టణానికి చెందిన పైడిశెట్టి శ్రీకర్ తన తండ్రి ప్రతాప్ జ్ఞాపకార్థం అరతులం బంగారు బుట్టాలను మంగళవారం సమర్పించారు. సుమారు 35వేల రూపాయల పైన విలువ గల బంగారు వస్తువులు అందించడం పట్ల ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్పొరేషన్‌పై ఏసీబీ అధికారులు దాడులు

- పట్టుబడిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : శ్రీకాకుళం నగరంలోగల భారతినగర్‌కు చెందిన బాధితుడు అతని ఖాళీ నివాస స్థలం సంబంధించిన పన్నును ప్రాసెస్ చేయడానికి శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఇన్స్ పెక్టర్ గౌరి శంకరరావును కలవగా రూ.20వేలు డిమాండ్ చేయడంతో, ఫిర్యాదు దారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీనిపైన కేసు నమోదు చేసుకున్న అధికారులు మంగళవారం మున్సిపల్ కార్పోరేషన్ రెవెన్యూ ఇన్స్ పెక్టర్ గౌరి శంకరరావు ఫిర్యాదిదారుడు వద్ద నుండి రూ.20వేలు లంచంగా తీసుకుంటుండగా శ్రీకాకుళం రేంజ్ అవినీతి నిరోధకశాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందిత అధికారిని అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తామని తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కోరికానపుట్టుగ గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభానికి కారు ఢీకొన్న ఘటనలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఈ మేరకు మంగళవారం ఉదయం కారులో కవిటి నుండి ఇచ్ఛాపురం వైపు ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులు కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఎటువంటి ప్రమాదం జరగలేదు. కారుకు స్వల్పంగా నష్టం ఏర్పడింది. ఈ ఘటనలో జరిగిన నష్టానికి విద్యుత్ శాఖ అధికారులు నష్టాన్ని పూరించేందుకు శాఖాపరమైన చర్యలు చేపట్టి నష్టపరిహారం వసూలు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

వరినారు ఎదుగుదలకు యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర-సోంపేట : ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వలన వరినారు ఎదుగుదల లోపించిందని ఆకు పెరుగుదలకు రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పి.ఉదయ్, డాక్టర్ పి.అమరజీవి, డాక్టర్ కె.సంధ్యారాణి పేర్కొన్నారు. సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తితో కలిసి మంగళవారం ఈ మండలం పాలవలస, పాత్రఖండ రైతు భరోసా కేంద్రాల పరిధిలో వరి నారుమళ్లను పరిశీలించారు. వెంటనే నారుమళ్లకు నీరు పెట్టి ఎరువు జల్లడం వలన నారు అందివస్తుందని సూచించారు. పొలాల్లో పచ్చిరొట్ట ఎరువు దున్నేముందు ఎకరానికి కనీసం 50 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పెట్ చల్లితే త్వరగా చీకి ఎరువుగా మారుతుందని అన్నారు. ఈ ఏడాది కొత్తగా ఎంటియు 1318 వరి రకం పాత్రఖండలో 30 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రవీణ్‌కుమార్, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

పోర్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్సీ దువ్వాడ

పూర్తి పరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం రాత్రి మూలపేట పోర్టు నిర్వాసితులుతో ఎమ్మెల్సీ దువ్వాడ, టెక్కలి సబ్ కలెక్టర్ టి రాహుల్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా నిర్వాసితులు, సర్పంచ్ జీరు బాబూరావు మాట్లాడుతూ, మా భూములకు ఇంతవరకు పూర్తి పరిహారం చెల్లించలేదని, జీడీ తోటలకు ఎకరాకు 5000 రూపాయలు నష్టపరిహారం ఇస్తామని చెప్పి, సగం డబ్బులు చెల్లించారని ప్రశ్నించారు. ఈ విషయంలో దువ్వాడ మాట్లాడుతూ ముందుగా చెప్పినట్లు ప్రతి డిమాండ్ పరిష్కరించబడుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ డి ఎస్‌పి బాలచంద్ర రెడ్డి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టు సంఘాల నేతలు

ఫీజు రాయితీ సర్క్యులర్ విడుదలకు ధన్యవాదాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో శతశాతం ఫీజు రాయితీ కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ విడుదల చేయడం అభినందనీయమని జర్నలిస్టు సంఘాల నేతలు కొంక్యాన వేణుగోపాల్, ఎస్.జోగినాయుడు పేర్కొన్నారు. జర్నలిస్టుల సంఘాల అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బిలాఠకర్ స్పందించి విద్యాశాఖాధికారులకు ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ప్రొసీడింగ్స్ విడుదల చేసిన కలెక్టర్ ను ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ (సీమ) అధ్యక్షులు ఎస్.జోగినాయుడు జిల్లా కలెక్టర్ ను కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ను జర్నలిస్టు నేతలు సత్కరించారు. గత కొన్నేళ్లుగా జిల్లా కలెక్టర్ల ప్రొసీడింగ్స్ మేరకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజు రాయితీ కల్పిస్తున్నాయని, అదే ప్రక్రియ ఈ ఏడాది కూడా కొనసాగించేందుకు విద్యాశాఖాధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో పాటు కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు విధిగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని వేణుగోపాల్, జోగినాయుడు కలెక్టర్ ను కోరారు. జిల్లాలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని వీరు కలెక్టర్ ను కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో జర్నలిస్టులు శ్రీనుబాబు, ఎం.ఏ.వి.సత్యనారాయణ, ఎం.వాసు, పృథ్వీ, గొంద్యాల ప్రశాంత్, వజ్జ నాగరాజు తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేశాం

- వినతి అందజేసిన నియోజకవర్గ మహిళా పోలీసులు

విశాలాంధ్ర-కవిటి: గ్రామ సచివాలయాల్లోని సేవలతో పాటు ఎన్నికల విధులు,ఐసిడిఎస్ విధులు పోలీసు శాఖ విధులు, గ్రామ సంరక్షణ వంటి తదితర విధులను నిర్వహించి మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేశామని మహిళా పోలీసు సంఘ ప్రతినిధులు అన్నారు.ఈ మేరకు మంగళవారం హెూంశాఖ పోలీసు మాతృ సంస్థలోనే తమను కొనసాగించాలని మహిళా పోలీసుల సంఘ ప్రతినిధులు జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ను కలసి వారి నివాస గృహం బల్లిపుట్టుగలో వినతి పత్రం అందజేశారు. కొంతమంది స్వార్థ పూరిత ప్రయోజనాల కోసం కోర్టులో కేసులు వేసి తమ విధులను పోలీస్ శాఖ నుండి తప్పించడం అన్యాయమని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తమను మునుపటిలాగే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహించేటట్లు చర్యలు తీసుకొని జాబ్‌చార్ట్ విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో ఇచ్ఛాపురం నియోజకవర్గం మహిళా పోలీసుల సంఘం ప్రతినిధులు షేక్ మధర్బీ, సూర్యకుమారి, ఉషారాణి, యామిని, శ్రీదేవి, శారద, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరం పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు విశ్రాంత వృక్ష శాస్త్ర అధ్యాపకులు ప్రగడ వెంకటరమణ నగదు ప్రోత్సాహం అందజేశారు. ఈ మేరకు సోమవారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి లో మంచి మార్కులు సాధించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు గుడియ హేమలత, పిల్లి భార్గవి, వజ్జ స్వాప్ని లకు ప్రోత్సహిస్తూ స్థానిక కవిటి గ్రామానికి చెందిన విశ్రాంత వృక్ష శాస్త్ర అధ్యాపకులు ప్రగడ వెంకటరమణ ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా 3వేలు, 2 వేలు, వెయ్యి రూపాయలు నగదు బహుమతిని ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సహిస్తూ అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రతీ ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో నడుచుకొని, జీవితం లో ఉన్నత స్థాయిలకు వెళ్లలా చదువుకోవాలని అన్నారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు కే.జానకి రావు మాట్లాడుతూ ఇలాంటి ప్రోత్సాహాలను గత కొన్ని సంవత్సరాలుగా అందిస్తున్న వెంకటరమణ సేవ అమోఘమని కొనియాడారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు పి.వాసుదేవరావు, గోవింద చంద్ర పాడి, ఏ వెంకటరావు, పి బి కే.శర్మ, గిరిబాబు, టి.రాధిక, పి పద్మిని, బి.అరుణ కుమారి, పి ఎస్ ఆర్ నాయుడు, నాగరాజు, శిరీష, గోద్దాయి ప్రకాశ్, దీనా రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు భూ హక్కు కల్పించండి

పెత్తందారుల బారి నుండి గిరిజన రైతులను కాపాడండి

విశాలాంధ్ర-సరుబుజ్జిలి/బూర్జ : సరుబుజ్జిలి మండలం పంచాయతీ పరిధిలో గల వెన్నెలవలస గ్రామంలో గిరిజనులు 40 సంవత్సరాలుగా బూర్జ మండలం, అన్నం పేట పంచాయతీ, అట్టూరిపేట రెవెన్యూ బౌండరీలో గల సర్వే నెంబర్:1-6,08,19, 04 సర్వే నెంబర్లలో గల సుమారు పది ఎకరాల పంట పొలాలు సాగు చేస్తున్నారు. సవర సన్యాసి ఆధ్వర్యంలో సుమారు పది కుటుంబాలు మంగళవారం కలెక్టర్ గారికి కలిసి 40 సంవత్సరాలుగా మేము ఈ పొలాలని సాగు చేసుకుంటున్నామని, రాళ్ళ గుట్టలతో ఉన్న ఈ పొలాలని కష్టపడి, శ్రమించి సాగు భూమిగా మార్చామని, మాకు ఈ పొలాల పైన పట్టాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, మేము సాగు చేస్తున్న పొలాలలో భూస్వాములు చొరబడి దౌర్జన్యం చేస్తున్నారని, గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించుకున్నారు. ఈ పొలాలకు పట్టాలు లేకపోవడంవల్ల ప్రభుత్వ అందించినటువంటి పథకాలు కూడా మాకు చేరువకావడంలేదని, సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నామని, గిరిజన రైతులకు న్యాయం చేకూర్చే బాధ్యత సర్కారు వారే తీసుకోవాలని కోరారు. గిరిజనులకు భూ హక్కు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రభుత్వము గిరిజనులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకొని, మేము సాగు చేస్తున్న భూమిపై హక్కును మాకు కల్పించగలరని జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సోదరులు పాల్గొన్నారు.

కాంపాక్ట్ బ్లాక్‌ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పరిశీలన

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలం గొలివివానిపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న పంటలను రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం నుండి వచ్చిన వీరబాబు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గ్రామంలో పొలంబడి జరుగుతున్న కాంపాక్ట్ బ్లాక్‌ను మరియు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల క్షేత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంపాక్ట్ బ్లాక్‌ను ఏ విధంగా ప్రకృతి సేద్యంలో విస్తరింప చేయాలో అలాగే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు యొక్క క్షేత్రాలను ఇంకా మెరుగైన పద్ధతులను చేసేలా సిబ్బందికి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో సిబ్బంది యన్.ఎఫ్.ఎస్ గోవిందరెడ్డి, బాబాజీ, శ్రీదేవి, ధనుంజయ్, హారేరామ, పద్మ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై భారతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక ఏడురోడ్ల కూడలిలో మణిపూర్ ఘటనపై జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులచే శాంతియుత ప్రమాణం చేయించి ర్యాలీని ఏడురోడ్ల కూడలి నుండి, వివేకానంద విగ్రహం వరకు కొనసాగించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ నేషనల్ చైర్మన్ డా. పిసి సాహు ఆదేశాల మేరకు రాలిని నిర్వహించామని, మణిపూర్ ఘటన యావత్ దేశాన్ని కలచివేసిందని, ఘటన జరిగి మూడు నెలలు దాటినా, ఇంకా అల్లర్లు, హత్యలు, మాన భంగాలు జరుగుతూనే ఉన్నాయని, అసలు మానవత్వమే అక్కడ పూర్తిగా నశించిపోయిందన్నారు. అధికార ప్రభుత్వం, అక్కడ ఒక తెగవారికీ అండగా ఉంటూ ఇటువంటి దుర్ఘటనలు చెయ్యిస్తుందని, అధికారములోనున్న ప్రభుత్వాలు ఇంతవరకు మణిపూర్ విషయములో సరైన నిర్ణయాలు తీసుకోవటం లేదన్నారు. ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించిన నిందుతులకు ఉరి శిక్ష విధించాలన్నారు. సత్వరమే ప్రభుత్వాలు న్యాయం చేసే విధంగా మానవ మృగాలకు శిక్షపడేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. అప్పుడే దేశం బాగుపడుతుందని వక్తలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాతీయ హ్యూమన్ రైట్స్ వైస్ చైర్మన్ డా. అల్లెల్ల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రెసిడెంట్ అల్లు ఇమ్మాన్యుయేల్, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్ డా.మంత్రి వెంకటస్వామి, జాతీయ హ్యూమన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్ డా. టి. మణికంఠ, రాష్ట్ర సెక్రటరీ జోయ్ ప్రసాద్, జిల్లా మహిళా సంరక్షక అధ్యక్ష్యులు అల్లు సుధా, మండల సెక్రటరీ పీఎస్ విజయ్ కుమార్, ప్రేమ్ కుమారి, బాలకృష్ణ, గ్రీన్ సిటీ మణిశర్మ, చేయూత ప్రెసిడెంట్ వెంకట లక్ష్మి, నంది ఉమా శంకర్, కిల్లారి వెంకటరమణ, కే. శివ, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోనూ అన్నదానం గొప్పది

104వ రోజు జోరు వానలో కూడా అన్నా క్యాంటీన్ కొనసాగింపు

విశాలాంధ్ర-అరసవల్లి: అన్ని దానాల్లోనూ అన్నదానం గొప్పదని, అన్నార్తుల కోసమే అన్నాక్యాంటీను ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తామని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. టీడీపీ యువ నాయకులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నాక్యాంటీన్ మంగళవారం 104వ రోజు కొనసాగించారు. అలాగే పాత బస్టాండ్‌లో 104వ రోజు కూడా అన్న క్యాంటీన్‌ను నిర్వహించారు. అలాగే మొబైల్ వ్యాన్ల ద్వారా నగరంలో పల్సేట పేదలకు నిరాశ్రయులకు భోజనాలను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం పార్టీ, మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం 2024 లో అధికారంలోకి వస్తుందన్నారు. 2024 లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మరలా అన్నా క్యాంటీన్లను కొనసాగిస్తారని చెప్పారు. అన్న క్యాంటీన్ ల ద్వారా ప్రతిరోజు జిల్లాలో వేలాది మంది కడుపు నింపుకునే వారన్నారు. చంద్రబాబునాయుడు మరలా ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన పాలన అందిస్తారని, నేటి వైస్సార్సీపీ పాలనలో రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరధరలతో పేదల, సామాన్యుల బతుకులు చిన్నాభిన్నమైనవని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 550 మంది అన్నార్తులు భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలోవార్డ్ మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మి రాజ్యం, రాయి కిరణ్, మోహన్, ఎస్‌వీ. రమణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే సీఎం ధ్యేయం

- ఇంటింటికి మంచినీటి పథకం
- ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస : పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ఆమదాల వలస మండలం పరిధిలోని సుమారు 64 లక్షల నిధులతో మునగవలసలో సుమారు 61 లక్షల నిధులతో దన్నానపేటలో సుమారు 47.37 లక్షల నిధులతో సంత కొత్తవలస గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి కార్యక్రమానికి మంగళవారం స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ ఇందు కూరి రఘురాజు, డిఈ సూర్యనారాయణ, ఏఈ చంద్రమౌళి, ఎంపీడీవో వాసుదేవరావు, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, పిఏ సి ఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ రాయి చిన్నారావు, స్థానిక నాయకులు దన్నానా సత్యనారాయణ, దన్నాన రవి బగాది రామినాయుడు తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భూ హక్కుదారులుగా గుర్తించాలని వినతి

విశాలాంధ్ర-ఆమదాలవలస : 20 సూత్రాలు అమలులో భాగంగా తమకు అప్పటి అధికారులు కేటాయించిన భూములపై శాశ్వత భూహక్కు కల్పించేలా చొరవ తీసుకోవాలని సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు సభాపతి తమ్మినేని సీతారాంకు విన్నవించుకున్నారు. ఈ మేరకు భూములకు సంబందించిన వాస్తవ పరిస్థితులకు సభాపతికి వివరిస్తూ స్పీకర్ క్యాంప్ కార్యాలయంవద్ద వినతిపత్రం అందజేశారు. గ్రామములో అవధానుల చెరువు ప్రక్కన గల భంజరు భూమి సర్వే నెంబర్లు (1) 249, (2) 254/2, (3) 248/1లలో, 1976 సంవత్సరములో 20 సూత్రాల ప్రాతిపదికన నిరుపేద ప్రజలకు ప్రభుత్వ భూమిని పంచడం ద్వారా తమకు భూములు ఇచ్చినట్లు వివరించారు. భూమిలో పెద్ద కంచి చెట్లు, మట్టి దిబ్బలు, గచ్చపొదలు తదితర వాటిని తీసివేసి అయొక్క భూమినంత చదును చేసి సాగు చేసుకుంటూ ఉన్నామన్నారు. ప్రభుత్వం కో-ఆపరేటివ్ జాయింటు ఫార్మింగ్ ద్వారా రిజిస్టరీ చేసి చేతి పనిముట్లు, దుక్కి పశువులు, నీటి ఇంజనులు ఇచ్చియున్నారన్నారు. అప్పటి నుంచి సాగు చేసుకొంటూ జీవనోపాధి పొందుతున్నామని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు గతములో పట్టాలు ఇచ్చిన భూములకు స్వంత హక్కులు కల్పించే దిశగ నూతన వరవడికి కంకణం కట్టుకోవడం శుభ పరిణామం అన్నారు. తమకు ఇచ్చిన భూములుకు ఎటువంటి పట్టాదారు పాసు పుస్తకములు లేవని, ఈ నేపథ్యంలో భూములను రీ-సర్వే చేసి భూయజమాన్యపు హక్కుదారులుగా తమను గుర్తించేలా చూడాలని సభాపతికి విన్నవించారు. వారితోపాటు సరుబుజ్జిలి ఎంపీపీ కేవీజీ సత్య నారాయణ, పురుషోత్తపురం రైతులు పాల్గొన్నారు.

నేటి నుండి 7వ తేదీ వరకు డిపార్ట్‌మెంట్ టెస్ట్

- హాజరుకానున్న 1511 మంది అభ్యర్థులు
- జిల్లా రెవెన్యూ అధికారి మురళీ కృష్ణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం : శాఖాపరమైన పరీక్షలు నిర్వహణకు పగడ్బంది ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళీ కృష్ణ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎపిపిఎస్సీ నిర్వహిస్తున్న ఈ నెల 2 నుండి 7 వరకు శాఖా పరమైన పరీక్షలు నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ నుండి 7వ తేదీ వరకు శాఖాపరమైన పరీక్షలకు జిల్లాలో 2 పరీక్ష కేంద్రాలను ఎపిపిఎస్సీ ఏర్పాటు చేయడమైనదని, ఈ పరీక్షలకు 1511మంది ఉద్యోగులు హాజరుకానున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం 03 నుండి 5గంటల వరకు ఆబ్జెక్టివ్ టైప్ ఉంటుందన్నారు. ఇలాగే ఉదయం 10 గంటల నుండి 01 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు ఉంటుందని, డిస్క్రిప్టివ్ ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు. శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని చెప్పారు. గర్భిణులు, విభిన్న ప్రతిభా వంతులకు గ్రౌండ్ ఫ్లోర్ లోనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ బి. సిహెచ్.కుమార్ రాజా, సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్, అడిషనల్ ఎస్పి తిప్పు స్వామి రమణ, వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి బి. మీనాక్షి, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, సెక్షన్ ఇన్చార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు : కలెక్టర్



విశాలాంధ్ర-శ్రీకాకుళం: కలక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలక్టరు శ్రీ శ్రీకేష్ బి. లాఠకర్ అధ్యక్షతన వైద్యాధికారులతో సమీక్షా సమావేశం జరిగినది. ఎన్.సి.డి. సర్వే ప్రతీ పి. హెచ్.సిలోన బి.పి. పేషంట్లు, డయాబెటిక్ (షుగర్ వ్యాధిగ్రస్తులు) నమోదు మరియు చికిత్స వాటి వివరాలు ఆన్లైన్లో అప్లోడ్ చేయుట గూర్చి, మరియు విపులముగా పి.హెచ్.సిల వారిగా వైద్యాధికారుల వద్దనుండి వివరాలు తెలుసుకున్నారు. తక్కువగా చేసిన పి.హెచ్.సి.లు (గంగువాడ, చొర్లంగి, మాకివలస, జి.సిగడాం, సింగుపురం పి.హెచ్.సిలకు) మందలించారు. వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. టెక్కలి డిప్యూటి డి.ఎమ్.హెచ్.ఓ పనిచేస్తున్న డా.లక్ష్మీ తులసీ, పలాసాకు డిప్యూటి డిఎమ్‌హెచ్‌ఓగా బదిలీ చేయాలని, డి.ఎమ్.హెచ్.ఓకి ఆదేశాలు జారీచేశారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యాలయములో పనిచేస్తున్న డి.పి.హెచ్.ఎన్.ఓ శైలజాకి మందలించి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. చక్కగా పనిచేసిన వైద్యాధికారులు (కింతలి, తొగరాం వైద్యాధికారులు) ను వంద శాతం ప్రగతి సాధించినవారికి అభినందించారు. ఎన్.సి.డి. ప్రోగ్రామ్ అధికారిని డా.సి.పి. శ్రీదేవిని సెలవుపెట్టి వెళ్ళిపోవాలని డి.ఎమ్.హెచ్.ఓకు ఆదేశించారు. అర్బన్ హెల్త్ సెంటర్ కోఆర్డినేటర్ డా. లింగరాజు పనితీరు మెరుగుపరచుకోవాలని, లేనియెడల తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారిణి డా .బి. మీనాక్షి అదనపు వైద్యాశాఖాధికారిణి డా.ఎన్. అనూరాధ, డి.ఐ.ఓ, ఆర్.వి.ఎస్.కుమార్, డా.లక్ష్మీ తులసీ, డా.సి.పి. శ్రీదేవి, జిల్లా మాస్మీడియా అధికారి, పైడి. వెంకటరమణ, డా.ప్రకాష్ రావు,డా.రమణమూర్తి, డా.కొయ్యన అప్పారావు, డా.సుజాత, డి.ఎమ్.ఓ. సత్యన్నారాయణ, డిప్యూటీ డెమో ఎమ్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన మహిళ

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలో గల లింగాలవలస గ్రామంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన గంజాయి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం వచ్చిన సమాచారం మేరకు జలుమూరు ఎస్ఐ, ఎస్ఈబీ సిబ్బంది తో కలిసిన మొజ్జాడ సరస్వతి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 11కేజీల గంజాయిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి సరస్వతిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు నరసన్నపేట సీఐ తెలిపారు.

చినకొంగరంలో సత్యనారాయణ స్వామి సామూహిక పూజలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని చిన్న కొంగరామ్ గ్రామంలో టిటిడి ఆధ్వర్యంలో సోమవారం సత్యనారాయణ స్వామి సామూహిక పూజలు నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో పూజాది కార్యక్రమాలను ఘనంగా జరిపారు. మేళ,తాళాలతో భాజా, భజంత్రీలుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్మికుల ముట్టడి

విశాలాంధ్ర-పలాస: తమ సమస్యలు పరిష్కారం కోసం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపాలిటీ శానిటేషన్ వర్కర్స్ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. సిబ్బందిని లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం అధ్యక్షులు ఎన్.గణపతి, యూనియన్ నాయకులు సి.హెచ్.మురగన్, ఎం.రవి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పి.ఎఫ్ డబ్బులు 33 లక్షల 50వేల రూపాయలు కార్మికుల ఖాతాలో జమ చేయాలని, హెల్త్ అలవెన్సు కల్పించాలని, రిటైర్డ్ అయిన కార్మికుల కుటుంబాల నుంచి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబాల నుంచి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన తరువాత పింఛను అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.రమేష్, శంకర్, బి.కూర్మారావు, ఈశ్వరరావు, దివాకర్, తిరుపతి, సీతమ్మ, శకుంతల, గులాబీ, త్రివేణి, జానకి, ఉషాలు పాల్గొన్నారు.

కార్మిక నాయకులు అరెస్టు: మున్సిపల్ ముట్టడి సందర్భంగా కార్మిక నాయకులు ఎన్.గణపతి, సి.హెచ్.మురగన్, ఎం.రవి, రమేష్‌తో పాటు 30మందిని పోలీసులు అరెస్టు చేశారు. సమస్యలు పరిష్కారం చేయకుండా కార్మికులను నిర్బందించడం దుర్మార్గమని వారు ఖండించారు.

2024 ఎన్నికలకు కళింగుల పయనమెటు?

విశాలాంధ్ర పలాస: పలాస నియోజక వర్గం కళింగ సామాజిక కులంలో గందర గోళం నెలకొన్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీలో కొంత మంది ఉండగా మరి కొంత మంది వైసీపీ లో ఉంటూ కుల సంఘం ఏర్పాటు చేసుకొని రాబోయే 2024 ఎన్నికల్లో తమ సత్తా చూపేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఎత్తులకు పై ఎత్తులు గా ఉన్న నియోజక వర్గ రాజకీయాలకు కాళింగ సామాజిక వర్గం ఓట్లతో ముడిపడి ఉంది. ఈ కులానికి రాజకీయ పార్టీలు టిక్కెట్ ఇచ్చి గుర్తించాలని కులం అణిచివేతకు గురవు తుందంటూ సభలు, సమావేశాలు నిర్వాహకులు పెడుతూ తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఇదే సామాజిక వర్గం నుండి 2004 వరకు అప్పటి సోంపేట నియోజక వర్గం నుండి సుమారు 3 దశాబ్దాలు పోటీ చేసిన దివంగత నేతలు మాజీ పిసిసి అధ్యక్షులు మజ్జి తులసీదాసు, మజ్జి నారాయణరావులకు 1994, 1999 ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ ఎమ్మెల్సీ మజ్జి శారదలకు ఈ సామాజిక వర్గం పూర్తి స్థాయిలో సహకరించకుండా. గౌతు కుటుంబీకులకు ఎన్నికల్లో సహకరించినట్లు గణాంకాల తెలుపుతున్నాయి. అలాగే 2009లో పలాస నియోజక వర్గం ఏర్పడి ఎన్నికలు జరిగినప్పుడు దివంగత నేత మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులకు ఇదే సామాజిక వర్గం బ్రహ్మరధం పట్టడంతో ఆయన ఘన విజయం సాధించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కళింగ సామాజిక వర్గానికి చెందిన పలాస కాశీబుగ్గ మాజీ మున్సిపల్ చైర్మన్ వజ్జ బాబూరావు(వైకాపా), మజ్జి శారద (స్వతంత్ర), డాక్టర్ కణితి విశ్వనాథం (సమైఖ్యాంధ్ర)లు పోటీ చేసిన సమయంలో ఇదే సామాజిక వర్గంలో మెజార్టీ వర్గీయులు వీరికి మద్దతు తెలపకుండా ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ (టీడీపీ)కి మద్దతు పలికి గెలిపించారనే ప్రచారం జోరుగా సాగింది. 2004 సంవత్సరానికి ముందు ఉన్న సోంపేట నియోజక వర్గంలో గాని, 2009 నుండి పలాస నియోజక వర్గంలో గాని ఈ సామాజిక వర్గం కళింగ కుల అభ్యర్థులు పోటీ చేసినప్పటికీ సహకరించకుండా గౌతు కుటుంబీ కులకే కాపు కాశారని తెలుస్తోంది.మెజార్టీ కాళింగ సామాజిక వర్గం నివశిస్తున్న పోలింగ్ స్టేషన్ల పరిధిలో గౌతు కుటుంబీకులకే ఓట్లు వేసి గెలిపించారని అపవాదు ఉంది. ప్రస్తుతం కాళింగ సామాజిక వర్గం సంఘం పేరుతో సమీకరణలు చేస్తున్న వారు మామూళ్ళు రోజుల్లో రాజకీయంగా అన్యాయం జరుగు తుందని ప్రకటనలు ఇవ్వడమే తప్పా ఎన్నికల్లో కాళింగ అభ్యర్థులు పోటీ చేసినా గెలిపించిన దాఖలాలు కన్పించవని, దీంతో కులం కార్డుపై నమ్మకం పోయిందని పలువురు పేర్కొంటున్నారు. ఈ సామాజిక సహకరించి ఉంటే తమ నేతలు వజ్జ బాబూరావు, మజ్జి శారద, డా. కణితి విశ్వనాథం లో ఎవరో ఒకరు గెలిచి ఉండేవారని, రాజకీయంగా అభివృద్ధి చెందేవారని వారి అభిమానులు అంటున్నారు. ఈ రాజకీయ అంశాలు పరిశీలిస్తే కులం కార్డు ఎన్నికల్లో ఎవరికి మద్దతు పలుకుతుందో అవుతుందని, సమస్యలపై కుల సంఘం అనేది అన్ని రోజులు పనిచేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఎన్నికల ముందు సంఘం కదలికలు ఉండి ఎన్నికల అనంతరం స్థబ్దత అయిపోవడం అనవాయితీ మారిపో యిందని వజ్జ, డా. కణితి, మజ్జి కుటుంబీకులు పోటీ చేసిన సమయాల్లో ఈ సామాజిక వర్గం. ఓటర్లను ప్రసన్నం చేసుకున్నా కనికరించ కుండా వేరే సామాజిక వర్గం అభ్యర్థులకై ఓట్లు వేశారని కొంత మంది ప్రగతి కాముకులు పేర్కొంటున్నారు. "గొల్లు గోవింద రాజులవి.. ముడుపులు. వెంకటేశ్వర స్వామివి" అన్న చందంగా కాళింగ సంఘంలో కొంత మంది వ్యవహరిస్తున్న తీరుకు అద్దం పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా రాబోయే 2024 ఎన్నికల్లో తమ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి ఏ పార్టీ టిక్కెట్ ఇచ్చినా గతంలో కాకుండా ప్రస్తుతం అందరూ ఐక్యమత్యంగా ఉండి గెలిపించు కుంటామని పావులు కదుపుతున్నట్లు సమాచారం. అయితే ఏ పార్టీ ఈ సామాజిక వర్గానికి టిక్కెట్ ఇస్తుందో వేచి చూద్దాం.ఒకవేళ కాళింగ సామాజిక వర్గం కు టికెట్ రాకపోతే వారి మద్దతు వైసీపీ కా లేదా టీడీపీ కా తెలియని పరిస్థితి నెలకొందని పలువురు వ్యాఖ్యనిస్తున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండి పెట్టాలి

ఎంఈవో అప్పలరాజు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకంలో మెనూ ప్రకారం రుచికల భోజనం తయారు చేసిపెట్టాలని స్థానిక మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు అన్నారు. ఆయన మంగళవారం మండలంలో గల చీపుర్లపాడు పంచాయతీ దుర్గంపేట ఎంపీపీఎస్ పాఠశాలను అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల లెసన్ ప్లాన్, డైరీ, నోట్‌బుక్, వర్కుబుక్‌లను పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనంలో పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల అవరణలో మండల పరిషత్ నిధులతో జరుగుతున్న మరుగుదొడ్ల పనులను ఎంపీటీసీ బొడ్డు అప్పన్నతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. లక్ష్మణరావు, సహోపాధ్యాయుడు సనపల కరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

టీడీపీ సంక్షేమ పథకాలు గ్రామాల్లో ప్రజలకు వివరించాలి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం అచ్చెన్నాయుడుకు నిమ్మాడ తన క్యాంపు కార్యాలయం, కోటబొమ్మాళి టీడీపీ కార్యాయలంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు జిల్లా నలుమూలలు నుంచి పెద్ద ఎత్తున ఆయన కలుసుకొని తమ సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు వారికి పలు సూచనలు, సలహాలు చేశారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన చేస్తుందని దీంతో ప్రతి ఒక్కరు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలతో పాటు ప్రతీ కార్యకర్తకు, నాయకులకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అయితే మరో కొద్దినెలలు ఓపిక పడితే మళ్ళి టీడీపీ అధికారంలోకి వస్తుందని అప్పటి వరకు ఈ సమస్యలు ధైర్యంగా ఎదుర్కోవాలని కార్యకర్తలను పిలుపు నిచ్చారు.

వైకాపా నుంచి టీడీపిలోకి : నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వైఎస్సార్సీపీ నాయకులు, కాకినాడ కార్పొరేషన్ 16వ డివిజన్ నాయకులు కొనాడ ప్రకాశ్, డివిజన్ ముఖ్య నాయకులు అలాగే మత్స్యకార నాయకులు వారాది చంటి, అర్జాల రమణ సారధ్యంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు వారికి తెదేపా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు గరికిన చిట్టిబాబు, పేర్ల కోదండరావు గంగిరి నాగేశ్వరరావు, చింతపల్లి తాతారావు, కొనాడ రాము, గురుగుబెల్లి గోవింద్, కరుకు సింహాద్రి, కుందు కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మరిన్ని ఉన్నత పదవులు పొందాలి

రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ స్పోక్ మెన్‌గా పదవి పొందిన అప్పిని వెంకటేష్ మరిన్ని ఉన్నత పదవులు పొందాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పదవి లభించిన సందర్భంగా వెంకటేష్ కు, అచ్చెన్నాయుడు దుస్సాలువా, పూలమాలలు తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

జనహృదయ నాయకుడు రామ్‌మనోహర్‌నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: తండ్రికి తగ్గ తనయుడిగా నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే యువ నాయకుడు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు అని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు అన్నారు. నగరంలోని స్థానిక టౌన్ హాల్ లో మంగళవారం యువ నాయకుడు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తనయుడు ధర్మాన రాంమనోహర్ నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ధర్మాన యువసేన మరియు సోషల్ మీడియా ఆధ్వర్యంలో గంగు నరేంద్ర పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలిత జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరాలను సూరిబాబు ప్రారంభించారు. అనంతరం బర్తడే కేకును కట్‌చేసి ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాబోయే నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడని కొనియాడారు. పి.రవిశంకర్ మాట్లాడుతూ యువనేతగా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టాలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కారం చూపే నాయకుడు రామ్ మనోహర్ నాయుడు అని అన్నారు. అటువంటి నాయకుడు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించామని, ప్రజల సహాయ సహకారాలు ఆయనకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, కామేశ్వరి, ప్రకాష్ కారత్, రామ్మోహన్, పి.రవిశంకర్, వాసు, మాధవ్, దినేష్, అప్పు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడుకు యువజన సేవా సంఘం ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి గ్రామానికి చెందిన అట్టాడ వేణు గోపాల్ కు, సంతబొమ్మాళి యువజన సేవా సంఘం 10,500 రూపాయలు ఆర్థిక సహాయం చేసారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని. రెండు రోజులుకు ఒకసారి డయాలసిస్ చేయాలి అని వైద్యులు సూచించారని యువజన సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. వారి కుటుంబం ఆర్థికంగా తట్టుకోలేక వైద్యం చేయలేకపోతున్నారని తెలిసి సంతబొమ్మాళి యువజన సేవా సంఘం అడ్డుకుంది అని తెలిపారు. యువజన సంఘం స్థాపించి నేటికి 6 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా సహకారం అందించిన ప్రతీ ఒక్కరికీ కిడ్నీ బాధితులు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుచెట్టి భానుప్రకాష్, అట్టాడ సాయికుమార్, కొన్న రాము, పప్పు భీమారావు, నారాయణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ముద్దశర్మ, లంపీ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

టెక్కలి ఉప సంచాలకులు డాక్టర్ జయరాం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: పాడిరైతులు వర్షాకాలంలో పశువులకు సోకే ముద్దశర్మ, లంపీ వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించా లని టెక్కలి పశువైద్య ఉప సంచాలకులు డాక్టర్ వి. జయరాం అన్నారు. మంగళవారం పశు వైద్యాధికారులతో కలిసి కోటబొమ్మాళి మండలం లో కోటబొమ్మాళి, చౌదరి కొత్తూరు, చుట్టుగుండం, కన్నెవలస, సరియాపల్లి గ్రామాలలో ఉచితంగా 421 పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ఉచిత టీకాలు ఆగష్టు 1 నుండి 31వ తారీఖు వరకు మండలం మొత్తం పశు వులకు ఉచితంగా వేయటం జరుగుతుందన్నారు. ఈ టీకాలు 4 మసాలు వయసు పైబడిన దూడలు నుండి అన్ని వయస్సుల వాటికి వేసుకోవచ్చునని, అలాగే చూడితోనున్న పశువులకు కూడా వేసుకోవచ్చునన్నారు. ఈ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యాధి నివారణ టీకాలు వేయించు కోవాలని, ఇవి వేయటం వలన పశు వులలో వచ్చే ముద్ద చర్మ వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చునన్నారు. ఈ టీకాలతోపాటు నట్టల నివారణ మందులు కూడా క్రమ పద్ధతిలో వేయటం వలన రోగ నిరోధక శక్తి పెరిగి ఈ వ్యాధి బారిన పడకుండా కాపాడావచ్చునన్నారు. లంపీ స్కిన్ వ్యాధి వ్యాప్తి బాహ్యపరాన్న జీవులైన ఈగలు, దోమలు మరియు కొణుసులు వంటి కీటకాల వలన వ్యాప్తి చెందుతుందని, ఈ వ్యాధి వచ్చిన పశువుల్లో తీవ్రమైన జ్వరం, చర్మం మీద కణతలు రావడం, కణతలు పగలి రక్తం కారటం, కాళ్ళ వాపులు రావడం జరుగుతుందని, వీటితో పాటు అలిక, చర్మం కాలినట్టు అవ్వటం, చర్మం అట్టకట్టి ఊడిపోవడం, ఎక్కువగా చిన్న దూడలు ఈ వ్యాధి సోకటం వలన చనిపోవటానికి అవకాశం ఉందని కావున ముందుగానే తగు జాగ్రత్త వహించి టీకాలు వేసుకోవాలి పాడి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి సహాయ సంచాలకులు డా.ఎం.లోకనాదం, పశువైద్యాధి కారులు డా.లఖినేని కిరణ్ కుమార్, డా.వెంకటేష్, డా. ప్రజ్ఞచైతన్య, పశు వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు బోయిన గోవిందరాజులు, గ్రామ పెద్దలు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలపై సర్వే ప్రారంభం

విశాలాంధ్ర-పోలాకి: జాతీయ కుటుంబ ఆరోగ్య సేవలపై సర్వే ప్రారంభమైనట్లు గుప్పెడుపేట వైద్యాధికారి రత్నరాజు తెలిపారు. మంగళవారం ప్రారంభించిన సర్వేలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుప్పుడిపేట పరిధిలోగల బెలమర పాలవలస ఎంపిక చేసిన గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసేందుకు ప్రత్యేక బృందాలు రావడం జరిగిందని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సేవలు అన్నింటిపై ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అందులో భాగంగా ఆరోగ్యశ్రీ తోపాటు 104 సేవలు సరిగా అందుతున్నాయా లేవా అని అడిగి బృందాలు తెలుసుకుంటున్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా పోషక ఆహారాలు లోపాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు శత శాతం అందుతున్నాయా లేదాని ఇంటింటా తెలుసుకుంటున్నారు. శిశువు నుండి యూక్త వయస్సు వచ్చే వరకు టీకాలు సక్రమంగా పడుతున్నయా లేవా అని గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి ఒక్క ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించి ఈ సర్వే చేయడం జరుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుప్పెడుపేట వైద్య సిబ్బంది సిహెచ్ఓ సరస్వతి ఎంపిహెచ్ ఈఓ మెండ కృష్ణారావు హెల్త్ సూపర్వైజర్ శివ గణేష్ ఎంఎల్‌హెచ్‌పి దివ్య హెచ్‌వి రవికుమార్ ఏఎన్ఎం వెంకటరత్నం పాల్గొన్నారు.

ఏబీసీ మానిటరింగ్ కమిటీ రివ్యూ మీటింగ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: నగరాన్ని రబిస్ రహిత నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యం తో గ్రీన్ మెర్సీ సంస్థ, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న ఏబీసీ/ఏ ఆర్‌వి కార్యక్రమాన్ని సమీ క్షించేందుకు మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం కాజిపేట ఏబీసీ సెంటర్‌లో జరిగింది. కార్పొరేషన్ కమీషనర్ ఓబులేసు అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో వీధి కుక్కల జనాభా అదుపుకు చేపట్టిన కార్యక్రమం అమలు తీరుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఏబీసీ కార్యక్రమం పటిష్టంగా అమలు జరిపేందుకు అవసరమైన వ్యూహాన్ని, పలు నిర్మాణాత్మక సలహా సూచనలను గ్రీన్ మెర్సీ సంస్థకి మానిటరింగ్ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా అందించారు. వీధి కుక్కల జనాభా అదుపుకు జులై నెలలో చేపట్టిన చర్యలపై కమిటీ సభ్యులు సమగ్ర సమీక్ష నిర్వహించారు. మొత్తం మీద కార్యక్రమం అమలు తీరు పై మానిటరింగ్ కమిటీ సంతృప్తిని ప్రకటించింది. కార్యక్రమం చివరిలో ఆర్గాన్ కౌంట్ కార్యక్రమం నిర్వహించి, జులై నెలలో 454 వీధి కుక్కలకు సంతాన నిరోధక ఆపరేషన్లు జరిగిన విషయాన్ని మానిటరింగ్ కమిటీ నిర్ధారించింది. ఈ కార్యక్రమం లో నగర పాలక సంస్థ ఎం.హెచ్.ఓ. డాక్టర్ వెంకట రావు, హెడ్ క్వార్టర్స్ వెటరినరీ పాలి క్లినిక్ ఏ. డి.డాక్టర్ వై. వి. కృష్ణారావు, వెట్ సర్జన్ డాక్టర్ హేమంత్ కుమార్, ఏబీసీ సర్జన్స్ డాక్టర్ సాయి ఆదిత్య, డాక్టర్ హర్షవర్ధన్ పాల్ తదితరులు పాల్గొన్నారు. మానిటరింగ్ కమిటీ సభ్యులకు గ్రీన్ మెర్సీ సంస్థ సీఈఓ రమణ మూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-హిరమండలం: మండల కేంద్రమైన హిర మండలం చిన్నకోరాడవీధి జంక్షన్ వద్ద ఆర్ ఎం పి వైద్యులు బూర శ్రీనివాసరావు క్లినిక్ లో మంగళవారం తంగి అమ్మన్న చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు తంగి రమేష్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాగోలు జేమ్స్ హాస్పిటల్ వైద్యాధికారి డా.షర్మిల 38 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో ఎనిమిది మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించా మన్నారు. వీరికి మధు మెహం, రక్త పోటు తదితర పరిక్ష లు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జిల్లా అందత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరు కళ్ళు ను తనిఖీ చేయించు కోవాలని మానవ జీవితానికి కళ్ళు ముఖ్య పాత్ర పోషిస్తాయని ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి శంకర్ రావు, గొర్లె సురేష్, బూర శ్రీనివాస్, టెక్నీసియాన్ లు నీరజ, హారిక, పీఆర్ఓ. బి దుర్గారావు తదితరులున్నారు.

మహోన్నత లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం

జిల్లాలో జగనన్న సురక్ష ద్వారా 3,27,343 ధ్రువపత్రాలు ఉచితంగా పంపిణీ

జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జగనన్న సురక్ష కార్యక్రమం అర్హత ఉండి కూడా ఎవరూ ప్రభుత్వ పథకాలు అందకుండా ఉండకూడదన్న మహోన్నత లక్ష్యంతో జగనన్న సురక్షా కార్యక్రమాన్ని జూలై 1న లాంఛనంగా ప్రారంభించిందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరెట్ సమావేశ మందిరంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో కలెక్టర్ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పాఠశాలు, కాలేజీల ప్రారంభం, అడ్మిషన్ల నేపథ్యంలో విద్యార్థులు ఎవరూ ఇబ్బందులు పడకూడదని సురక్షా శిబిరాల్లోనే వివిధ ధృవీకరణ పత్రాలను కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. వివిధ శాఖలు జారీచేసే 11 రకాల ధృవీకరణ పత్రాలను ఎటువంటి యూజర్ ఛార్జీలు లేకుండా అక్కడికక్కడే ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు. అయితే ఈ కార్యక్రమం ప్రారంభమైన మొదటిరోజు నుంచే ప్రజలదగ్గర నుండి విశేషమైన స్పందన లభించిందన్నారు. జూలై 31వ తేదీ నాటికి మొత్తం 732 సచివాలయాల పరిధిలో ఉన్న 7,33,037 కుటుంబాల నుంచి 3,27,343 వినతులు వస్తే అక్కడికక్కడే పరిష్కారమయ్యాయన్నారు. అన్ని శాఖల ద్వారా సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి కూడా పథకాలు అందకపోతే వెంటనే స్థానికంగా ఉన్న వాలంటీరును కానీ గ్రామ, వార్డు సచివాలయాల అధికారులను కానీ సంప్రదించి అర్హత కలిగిన లబ్ధిదారులు పథకాలు పొందాలన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర-నందిగాం : చెత్త సంపద తయారీ కేంద్రాన్ని టెక్కలి పంచాయతీ డివిజనల్ అధికారి ఇప్పిలి వెంకటరమణ, వల్లభ రాయుడుపాడు పంచాయతీ చెత్త సంపద కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. సంపద తయారీ కేంద్ర పరిసరాల్లో మొక్కలు నాటారు. కేంద్రం నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. సర్పంచ్ మల్ల సీతారాం, రామానాయుడు, నందకిషోర్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పిడియాట్రిక్ విభాగానికి 91శాతం స్కోర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రభుత్వ ఆసుపత్రి లో 21, 22 తేదీలలో ముస్కాన్ నేషనల్ స్టాండర్డ్స్ ప్రకారము పిడియాట్రిక్ డిపార్ట్మెంట్లో పీరియట్రిక్ ఓపిడి, ఐపిడి,ఎస్ఎన్ సియు, ఎన్ఆర్సి విభాగంలో నిర్వహించిన సెషన్ లో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా 91శాతం స్కోర్ ఈ నాలుగు డిపార్ట్మెంట్లకు ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో మంత్రి రవికుమార్, క్వాలిటీ ఆఫీసర్ డాక్టర్ కోటేశ్వరరావు, పీడియట్రిక్ డాక్టర్ శ్రావ్య, డాక్టర్ సుజాత, ఎన్ఏపీహెచ్డీ లకు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ మంగళవారం సర్టిఫికెట్‌లు అందజేశారు.

కొబ్బరి మొక్కలు ఉచితంగా సరఫరా చేయాలి

కలెక్టర్‌కు వినతి అందజేసిన ఎమ్మెల్సీ నర్తు

విశాలాంధ్ర-కవిటి: మండలంలో కొబ్బరి వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావున 4 లక్షల కొబ్బరి మొక్కలు ఉచితంగా సరఫరా చేయాలనీ జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్ ను ఎమ్మెల్సీ నర్తు రామారావు కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బి.జి. పుట్టుగ గ్రామ పంచాయతీ పరిధిలో రైతు బరోసా కేంద్రం,హెల్త్ క్లినిక్‌లకు విద్యుత్, రోడ్ సదు పాయం కల్పించాలని కోరారు. కవిటి మండలం లో ఎక్కువగా గ్రామ సచివాలయలందు పోస్టులు ఖాళీలు యున్నందున పోస్టులు భర్తీ చేయగలరని విజ్ఞప్తి చేశారు. రాపాకపుట్టుగ గ్రామంలోగల ఎంపిపి స్కూల్‌లో అదనపు భవనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బి.జి. పుట్టుగ సర్పంచ్ బద్రి ప్రకాష్ పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం : రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : నగర పాలక సంస్థకు చెందిన 270 మంది లబ్ధిదారులకు పట్టాలను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం పంపిణీ చేశారు. ఇందుకు సంబంధించి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యకమంలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. నియోజవర్గం మొత్తం మీద 20 వేల పట్టాలు ఇచ్చామన్నారు. ఇందుకు రూ.500 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12 వేల కోట్లు ఖర్చు చేసి 31 లక్షల మందికి ఇంటి పట్టా ఇచ్చి వారి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత వైఎస్సార్సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, మీ అవసరాలు తెలుసుకొని వాటిని పరిష్కారించే దిశగా ఈ నాలుగేళ్ల ముందుకు వెళ్ళామని చెప్పారు. ఎవరి దగ్గర మోకరిల్లకుండా, దర్జాగా బతికేలా గడిచిన నాలుగేళ్లలో పౌరుల జీవన ప్రమాణాలను సమున్నతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇంతకుముందు పనిచేసిన నాయకులు, పాలన చేసిన నాయకులు ఎందుకు ప్రజలు జీవన ప్రమాణాలు పెంచలేదని ప్రశ్నించారు. మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండన్నారు. ఇళ్ళ విషయంలో ఒక్క పైసా ఖర్చు చేయని చంద్రబాబుకు పేదల ఇళ్ళ కోసం ప్రభుత్వం చేస్తున్న మంచి గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. ప్రజాధనం వృథా చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, గడిచిన పాలనలో ఎందుకు ఆ సెంటు భూమి అయినా ఇవ్వలేదని నేను ప్రశ్నిస్తున్నానన్నారు. పేదల కోసం విపక్ష నేత చంద్రబాబు ఏనాడైనా ఏకర భూమి ఆయినా కొన్నాదా..లేదు కదా, ఇంకా ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని మంత్రి ధర్మాన పేర్కొన్నారు. ఎమర్వో వెంకటరావు, వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు సాదు వైకుంఠ రావు, చల్ల అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి కొత్తూరుకు నూతన సర్వీసు ప్రారంభం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : కొత్తూరు మండలం కూడా టెక్కలి ఆర్టీసీ డివిజన్ పరిధిలో ఉండుట వలన ప్రయాణికుల సౌకర్యార్థం టెక్కలి డిపో నుండి కొత్తూరుకు బుధవారం నుండి కొత్త బస్ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు టెక్కలి డిపోమేనేజర్ యన్. శ్రీనివాసరావు తెలిపారు. ఈ బస్ టెక్కలి కాంప్లెక్స్ నుండి ఉదయం 09.30 గంటలకు బయలుదేరి జర్జంగి, శ్రీముఖలింగం, హిరమండలం మీదుగా 12.30 గంటలకు కొత్తూరు చేరుకుంటుందని ఆయన తెలిపారు. అలాగే కొత్తూరులో మధ్యాన్నం 01.30 గంటలకు బయలుదేరి, సాయంకాలం 04.30 గంటలకు టెక్కలి చేరుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించు కోవాలన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలు త్వరితగతిగా పూర్తి చేయాలి

- ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్

విశాలాంధ్ర-కవిటి : జగనన్న గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ అధ్యక్షతన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో సచివాలయాలు రైతు భరోసా కేంద్రాలు హెల్త్ సెంటర్లను నిర్మాణాలు సెప్టెంబర్ 15 తేదీలోగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని తెలిపారు. గృహ నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి సూర్యనారాయణ రెడ్డి,ఉప తాసిల్దార్ పి రామచంద్ర రావు,ఏ ఈ ఈ పి ప్రవీణ్, వైస్ ఎంపీపీ కర్రీ గోపయ్య మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు పూడి నీలాచలం, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, సర్పంచులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : జాయింట్ కలెక్టర్ నవీన్



విశాలాంధ్ర-మెళియాపుట్టి : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ నవీన్ అన్నారు. మంగళవారం నాడు మండలంలోని కొండప్రాంతమైన కేరాసింగి గ్రామాన్ని సందర్శించి అక్కడి గల ప్రజలతో సమావేశమయ్యారు. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. అందులో ప్రధానంగా తమకు రహదారి సౌకర్యం పూర్తిస్థాయిలో జరిగేలా కృషి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొండపైకి ట్రాక్టర్ పై రేషన్ తరలించే అవకాశం లేనందున మూడు నెలల రేషన్ ను అందజేయనున్నట్లు ప్రజలకు తెలిపారు. బిఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరయ్యాయని మరో మూడు నెలల్లో అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలుచేపడతామన్నారు. పాఠశాల భవనం సైతం అధ్వానంగా ఉందని తద్వారా కనీసం విద్యార్థులు కూర్చోవడానికి ఇక్కట్లు పడుతున్నారని తెలుపగా నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. సమస్యలన్నింటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భనలో ఆయనతో పాటుగా జిల్లా పౌరసరఫరాల శాఖధికారి వెంకటరమణ, తహాశీల్దారు సరోజిని, ఆర్ ఐ వైకంఠ రావు, వీఆర్ఓ శామ్యూల్, గ్రామస్తులు తదితరులున్నారు.

పేదలకు ఆహార వితరణ

విశాలాంధ్ర-ఆమదాలవలస : పట్టణంలో నియోజకవర్గ ఆకలితో అలమటిస్తున్న కొంతమంది పేదలకు ఆహారాన్ని అందించారు. మంగళవారం సిక్కోలు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆముదాలవలస కేంద్రంలో ఉన్న రైల్వే స్టేషన్, శివాలయం వీధి, లెప్రర్స్ కాలనీలో 150 మందికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిక్కోలు సర్వీస్ సొసైటీ చైర్మన్ కల్పన, కోఆర్డినేటర్ ప్రత్తిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈనెల3 నుంచి ఐటిఐలో రెండో విడత కౌన్సిలింగ్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ లో తొలి విడత కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన సీట్లకు ఈనెల మూడవ తేదీ నుంచి 2 విడత కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎచ్చర్ల ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ సుధాకరరావు తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ శ్రీకాకుళం డి ఎల్ టి సి లో నాలుగున పలాస కనితీస్ ప్రభుత్వ ఐటిఐ లో 5,7 తేదీల్లో, 20 ప్రైవేట్ ఐటిఐ లో కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. రెండో విడతలో కౌన్సిలింగ్ ఏఐటిఐ లో చేరేందుకు దరఖాస్తు చేసుకొన్నారో అదే ఐటిఐ లో నిర్దేశించిన తేదీల్లో కౌన్సిలింగ్కు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. తొలి విడతలో జిల్లాలోని మూడు ప్రభుత్వ ఐటిఐ లో 640కు 270 సీట్లు ప్రైవేటు ఐటిఐ లో మొత్తం 3,036 కు 230 సీట్లు భర్తీ అయినట్లు వివరించారు.

లైన్ షోయింగ్‌తో అధిక దిగుబడులు సాధ్యం

విశాలాంధ్ర-ఆమదాలవలస: మండలం ప్రకృతి వ్యవసాయ విభాగం లో భాగంగా మంగళవారం సిబ్బంది రైతులచేత లైన్ షోయింగ్ విధానంలో నాట్లును వేయించారు. ఈ సందర్భంగా నక్క చిరంజీవి మాట్లాడుతూ చేపేనపేట యూనిట్ పరిధిలో యెనిమిది ఎకరాల విస్తీర్ణంలో వరుస క్రమంలో నాట్లు ను వేయించామని అన్నారు. వరి పంట మొదటి దశ నుండి చివరి దశ వరకు పంటలో సస్య రక్షణ పద్ధతులను పాటించాలని, అలాగే పంటలో రాజీలేని సూత్రాలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తిరుపతిరావు, కృష్ణవేణి, లక్ష్మి, జానికిరామ్ తదితరులు పాల్గొన్నారు.